క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి రూ.24,500 వేతనం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, జిల్లా కోశాధికారి గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయ్ కుమారు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరు, కడప కార్పొరేషన్ లోను క్లాప్ బండ్లు నడుస్తున్నాయని తెలిపారు. పనిచేస్తున్న డ్రైవర్లకు ఆప్కాస్ పరిధిలో ఇస్తున్న మాదిరిగా రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా రక్షించే నాధుడే లేరని తెలిపారు. ప్రజల మలినాలను, చెత్తను తీసుకెళ్లడంలో వీరి పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టకపోవడం, నెల నెలా వేతనాలు రాకపోవడం, వచ్చే చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారని తెలిపారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి ఇఎస్ఐ, పిఎఫ్ కట్టని ఏజెన్సీల పైన చర్యలు తీసుకుని కనీస వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. వీటికి సంబంధించి లేబర్ కోర్టులో కొనసాగుతూ ఉందని తెలిపారు.

జమ్మలమడుగులో

ఆధిపత్య పోరుకు చెక్!

- ఇన్‌ఛార్జి పదవి రేసులో పిఆర్ వర్సెస్ సుధీర్
- ఇడుపులపాయలో వైఎస్ జగన్‌తో మంతనాలు
- మూడేసి మండలాల చొప్పున ఇన్‌ఛార్జిత్వం
- అలిగివెళ్లిపోయిన సుధీర్‌రెడ్డి?!
- కడప నియోజకవర్గ నేతలకూ క్లాస్

మాజీ ముఖ్యమంత్రి జగన్ కోసం వేచి ఉన్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/వేంపల్లె

జమ్మలమడుగు వైసిపిలో ఆధిపత్యపోరుకు తెరపడింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఓటమి పాలైన ఎం.వి.సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవిని దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. పిఆర్ జమ్మలమడుగులో వైసిపి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని ప్రజాసమస్యలపై గళమెత్తుతూ ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. జడ్పీ సమావేశంలో దాల్మియా సిమెంట్ ఆక్రమణల వ్యవహారాన్ని లేవనెత్తడం, బాధిత గ్రామాలకు న్యాయం చేయాలని కోరడం, గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను కలుసుకుని సమస్యలపై స్పందించడం వంటి కార్యక్రమాలతో చర్చనీయం చేశారు. సుధీర్‌రెడ్డి సైతం ఎమ్మెల్సీ ఎత్తుగడలకు ధీటుగా స్పందించి జమ్మలమడుగులో వైసిపి కార్యాలయాన్ని తెరవడం వంటి ప్రత్యామ్నాయ ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఇద్దరు నాయకుల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు కారణంగా కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది.

కుదరని నేతల సయోధ్య

వైఎస్.జగన్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఇడుపులపాయలో జమ్మలమడుగు నాయకులతో చర్చలు జరిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవిపై సమాలోచనలు సాగాయా లేక ఇద్దరు నాయకులను బుజ్జగింపు రాజకీయాలు చేశారా, లేక దేనిపై రహస్య మంతనాలు చేశారనే విశ్లేషణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం మండలాలకు, ఎమ్మెల్సీ పిఆర్‌కు జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. సుధీర్‌రెడ్డి తొలుత అలిగి వెళ్లిపోయారు. తీరుమా రకపోతే సదరు మూడు మండలాలను కోల్పోయే అవకాశం ఉందని హెచ్చ రించినట్లు తెలిసింది. ఒకరి ఇన్‌ఛార్జిత్వం వహించిన మండలాల్లో మరొకరు జిల్లా అధ్యక్షుడికి, ఎంపీకి తెలియకుండా పర్యటించరాదని సూచించినట్లు తెలిసింది. త్వరలో ఎంపీ అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు తెలిసింది.

కడప నేతలకూ వార్నింగ్

కడప నియోజకవర్గ నేతలైన డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డిలకు క్లాస్ పీకినట్లు సమాచారం. నియోకవర్గ రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో తడబడమేమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. కడపలో అంజాద్‌బాషా మాటే చెల్లుబాటు అవుతుందని తేల్చి చెప్పినట్లు సమాచారం. సురేష్‌బాబు ఇంటి ముందు చెత్తను వేసిన ఘటనలో ఎందుకు సమర్థవంతంగా వ్యవహరించలేకపోయారని నిలదీసినట్లు తెలిసింది. ఇటువంటి అనైక్యతతో కూడిన రాజకీయాలు చేయ రాదని హెచ్చరించినట్లు సమాచారం.

కడప 'ఉక్కు' కోసం

రాష్ట్రపతి సంతకం ఏమైంది?

- -15 ఏళ్ల ప్రత్యేక హోదాపై బిజెపి మాట తప్పింది
- ఎపికి అన్యాయంలో బిజెపి, టిడిపి, వైసిపి భాగస్వాములు
- బిజెపికి కొమ్ము కాస్తున్న టిడిపి
- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో వక్తలు

సెమినార్‌లో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి రాష్ట్రపతి చేసిన సంతకం ఏమైందని, పోలవరం, తుంగభద్ర బోర్డు, విద్యుత్, రైల్వేజోన్, ఓడరేవు, విమానాశ్రయాలు, మెట్రోరైలు ఎక్కడని వక్తలు ప్రశ్నించారు. మంగళవారం బాలాజీ నగర్‌లోని ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాల మీటింగ్ హాల్‌లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'రాష్ట్ర కమిటీ సమావేశాల' సందర్భంగా మొదటి రోజున 'రాష్ట్ర పునర్విభజన చట్టం - 2014 అమలు - పాలకుల పనితీరు' అనే అంశంపై డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివకుమార్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ తన అస్తిత్వ స్వప్రయోజనాల కోసం తెలంగాణా ఉద్యమాన్ని ఉధృతం చేశారని పేర్కొన్నారు. 2009, డిసెంబర్ 9న అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని ప్రకటించారని తెలిపారు. 2010లో ప్రభుత్వం 'శ్రీకృష్ణ కమిటీ' నియమించిందని, తన నివేదికలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సూచనలు చేసిందని, 2013, జులై 30న కేంద్ర మంత్రివర్గం బిల్లు ఆమోదించి శాసనసభ ఆమోదానికి పంపిందన్నారు. అప్పట్లో ప్రతి పక్ష బిజెపి తాము అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేక హోదా 15 ఏళ్లు ఇస్తామని నాయకులు నరేంద్రమోడి, అమిత్‌షా, వెంకయ్యనాయుడు పార్లమెంట్ సాక్షిగా సంతకం చేయడంతో అది చట్టంగా మారిందని పేర్కొన్నారు. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ఇచ్చిన ప్రత్యేకహోదా హామీ మాట మరిచిందని వాపోయారు. పార్లమెంటులో రాష్ట్ర పునర్విభజన చట్టం షెడ్యూల్ 13లో కేంద్ర ప్రభుత్వ ఉక్కు కర్మాగారాల నిర్మాణ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం రాష్ట్రపతి చేసిన సంతకం ఏమైందో అర్థం కావడం లేదన్నారు. దేశంలో అత్యున్నత పరిపాలన సభ పార్లమెంటు ఆమోదం ఎక్కడికి పోయిందో కేంద్రంలో మూడో దఫా అధికారంలో ఉండటానికి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రులు, నాలుగు సార్లు శంకుస్థాపనలు చేసిన ఘనత దక్కిందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో స్టీల్ కార్పొరేషన్ అథారిటీ ఏర్పాటు చేసి పట్టించుకోలేదని, జగన్మోహన్‌రెడ్డి లిబర్టీ అనే డిఫాల్ట్ కంపెనీ ఒకసారి, ఆర్థిక నేరస్తుడైన జిందాల్ కు, మరొక మారు జగన్మోహన్ రెడ్డి ౨ శంకుస్థాపనలు చేసి వదిలేసారన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రజలు మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి ఎంపీ సీట్లపై ఆధారపడి నిలబడి ఉందని, టిడిపి, జనసేన, బిజెపి, సంకీర్ణ ఎన్‌డిఎ ప్రభుత్వంగా చెప్పుకుంటూ రాష్ట్రంలో పరిపాలిస్తున్న చంద్రబాబు నాయుడు వెంటనే కడప ఉక్కు కర్మాగారం కేంద్ర ఉక్కు గనుల శాఖ సెయిల్ ఆధ్వర్యంలో నిర్మించడానికి ఒప్పుకోకపోతే, తన మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, కార్యదర్శి రామన్న, నాయకులు జి.చంద్రశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, రాష్ట్ర కమిటీ సభ్యులు హర్ష, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, తులసి, నరసింహులు, ఆంజనేయులు, సురేంద్ర, యువతి యువకులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం చేద్దాం

గెలవాలంటే కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి
ముఖ్య నాయకులతో వైఎస్.జగన్

పులివెందులలో ప్రజలతో కరచాలనం చేస్తున్న జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/వేంపల్లె

సమస్యలపై పోరాటం చేద్దామని, మళ్లీ మనం గెలవాలంటే కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని జిల్లా ముఖ్య నేతలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా బెంగుళూరు నుంచి హెలికాప్టర్‌లో ఇడుపులపాయకు 11.30 గంటలకు చేరుకున్నారు. ఇడుపులపాయలోని హెలిప్యాడ్ నుండి నేరుగా జగన్ తన తండ్రి వైఎస్ఆర్ సమాధి వద్దకు వెళ్లారు. వైసిపి నాయకులతో కలిసి వైఎస్ఆర్ సమాధికి పూలమాలలతో నివాళులర్పించారు. సమాధి వద్ద నుండి తన గెస్ట్ హౌస్‌కు వెళ్లారు. అక్కడే ముఖ్య నేతలతో ఆయన చర్చించారు ముఖ్యంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి మధ్య అభిప్రాయ బేధాలు ఉన్న విషయం తెలిసిందే. దీనిపై జమ్మలమడుగు ముఖ్య నేతలతో సుదీర్ఘంగా చర్చించి కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. జిల్లాలోని పార్టీ నాయకులు కార్యకర్తలు కలుపుకొని ముందుకు వెళ్లాలని ఆలోచిస్తేనే మనం రాబోయే రోజుల్లో మన కూడా సాధించగలమని జగన్ ఆదేశించినట్లు సమాచారం. జిల్లాలోని వైసిపి నాయకులు కార్యకర్తలు, ప్రజలు జగన్ కలిచేందుకు పులివెందుల చేరుకున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో వారి వ్యక్తిగత సమస్యలతో పాటు ఆ ప్రాంత సమస్యలను జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ ప్రభుత్వం ఇచ్చిన హామీల నెరవేర్చకపోతే పోరాటం చేసే దానికి సిద్ధంగా ఉంటామన్నారు. రాత్రి 9 వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. బుధవారం, గురువారం కూడా పులివెందులలోనే అందుబాటులో ఉండనున్నారు. అనంతరం వేంపల్లెలో నివాసం ఉన్న రుద్ర భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఇటీవల వివాహమైన నూతన దంపతులకు జగన్ ఆశీర్వదించారు. సివిల్ సప్లయ్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ వలి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పలకరించారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు వేంపల్లె నుండి పులివెందులకు బయలుదేరారు. పులివెందుల సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద జగన్ సెల్ఫీ తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి వచ్చిన సీట్లను కూటమి ప్రభుత్వం వెనక్కి పంపిందన్నారు. కాలేజీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఎమెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, సుధీకర్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పిటిసి రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా, బిఎస్ షెక్షావలి, ట్రైల్స్ మౌల్లా, ఎంపిటిసి భారతి, పద్మా జయలక్ష్మి, కటిక చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

నెమళ్లదిన్నెలో దారుణం

- కన్న కూతురుపై తండ్రి లైంగిక దాడి

ప్రజాశక్తి-పెద్దముడియం

కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి కసాయివాడి లాగా మారి కన్న కూతురిని లైంగికంగా బలాత్కరించిన ఘటన మంగళవారం మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి నిత్యం మద్యం సేవిస్తూ పనిపాట లేకుండా జులాయిగా తిరుగుతూ గ్రామంలో తరచూ గొడవలకు పాల్పడేవారు. అతను సైకోగా తయారవ్వడంతో స్థానికులు అతని మందలించటం మానేశారు. అతని అకృత్యాలకు ఎవరూ అడ్డు చెప్పక పోవటంతో మతిస్థిమితం లేని 17 ఏళ్ల వయసు గల కన్న కూతురుపై మద్యం మత్తులో లైంగిక దాడికి పాల్పడి ఘోరాతి ఘోరానికి ఒడిగట్టాడు. తండ్రి అసభ్య ప్రవర్తనతో కంగారు పడిన కూతురు ప్రతిఘటించి కేకలు వేయగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సభ్య సమాజం చీత్కారించుకునే ఘటనకు పాల్పడిన వ్యక్తిపై కఠిన శిక్షలు అమలు చేయాలని, ఇలాంటి హేయమైన ఘటనలు చోటు చేసుకోకుండా జీవితఖైదు విదించాలని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

నిరక్షరాస్యులకు వరం 'ఉల్లాస్'

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పి కార్యాలయ ఆవరణలోని డిపిఆర్‌సి మీటింగ్ హాల్‌లో వయోజన విద్యా శాఖ డిడి ఎం.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకం కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో 100 శాతం అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకోని పెద్దలను గుర్తించి వారికి ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యను వాలంటీర్ టీచర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 23,170 మంది నిరక్షరాస్యులను గుర్తించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. నవంబర్ 5 నుంచి మార్చి 15 వరకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. **స్వర్ణాంధ్ర -2047 లక్ష్య సాధనకు కృషి చేయండి**

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 ఆశయ సాధనలో భాగంగా ఐదేళ్ల (2024-29) జిల్లా విజన్ ప్లాన్ లక్ష్యాన్ని ఛేదించేందుకు కృషి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా విజన్ ప్లాన్ ప్రణాళిక రూపకల్పనపై కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

'బేడ బుడగ జంగం'కు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - కడప : బేడ బుడగజంగాలకు న్యాయం చేస్తామని షెడ్యూల్ కులాల కమిషన్ జాతీయ, రాష్ట్ర సంఘం నాయకులకు హామీ ఇచ్చిందని జిల్లా నాయకులు దూపం రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ న్యూఢిల్లీ లోక నాయక్ భవన్‌లో షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్ చందర్‌కు ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం కమిటీ తరపున తాటికొండ నారాయణ, తూర్పాటి మనోహర్, తాటికొండ కొండన్న, సిరివాటి గిరిధర్ కలిసి సమస్యలను విన్నవించారన్నారు. రిజర్వేషన్ సమస్య కేంద్రంలో పెండింగ్‌లో ఉందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రభుత్వాలు తమ నివేదికలను కేంద్రానికి క్షుణ్ణంగా పంపిన, న్యాయానికి నోచుకోవడం లేదని తెలియజేశారన్నారు. కమిషన్ సభ్యులు స్పందించడం హర్షణీయమన్నారు.

పక్షవాతానికి సత్వర వైద్యమే నివారణ

ప్రజాశక్తి - కడప అర్బన్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి

పక్షవాతానికి సత్వర వైద్యమే నివారణ అని కన్సల్టెంట్ న్యూరో సర్జన్, జగదీష్ న్యూరో కేర్ ఎండి డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ పక్షవాత దినోత్సవం పురస్కరించుకుని సిఎస్ఐ హై స్కూల్ ఎదురుగా ఉన్న జగదీష్ న్యూరో కేర్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షవాత లక్షణాలు తల తిరగడం, సరిగ్గా నడవలేకపోవడం, కంటి చూపు మసక రావడం, చూపు తగ్గడం, మూతి వంకర పోవడం, ఒక వైపు చెయ్యి, కాలు సచ్చుపడడం, తిమ్మిరి రావడం, మాట కడబడటం, సరిగ్గా మాట్లాడలేకపోవడం ఉన్నవారు త్వరగా ఆసుపత్రికి రావాలని చెప్పారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆకుపేషనల్ థెరపీ ద్వారా సాధారణ జీవితాన్ని రోగికి కలిగించవచ్చని పేర్కొన్నారు. కోలుకోవడం వ్యాధి తీవ్రతను బట్టి ఉంటుందని చెప్పారు. అనంతరం పక్షవాతానికి సంబంధించిన సమాచార కరపత్రాలను ఆవిష్కరించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడపఅర్బన్

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయి ంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహూల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. మంగళవారం కడప తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డిగ్రీ, ఇంజునీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత మైన విద్యలో సుమారు రూ.3,480 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే విడుదల చేస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ దాని గురించి పట్టించుకోలేదని వాపోయాకరు. ఇప్పటికే 2024 - 25 విద్యా సంవత్సరం ప్రారంభమైందని, 1,3,5 సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు కట్టాలని యూనివర్సిటీ నుంచి సర్క్యులర్ వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నవంబర్ 6న చలో కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనం రద్దు చేస్తే కూటమి ప్రభుత్వం దాన్ని మళ్ళీ ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు నిత్యావసర ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ చదివే ప్రతి విద్యార్థికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేలా చూడాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థి తల్లికి వందనం వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, హరి, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-14 గ్రూప్ బి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎసిఎ అండర్- 14 గ్రూప్‌బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. రాజారెడ్డి స్టేడియంలో శ్రీకాకుళం, విజయనగరం జట్ల ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ లో 89.0 ఓవర్లలో 336 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని జోగేంద్ర 124 (సెంచరీ) పరుగులు చేశాడు. వివేక్ నంద 61 పరుగులు చేశాడు. విజయనగరం జట్టులోని శ్రీ చరణ్ ఐదు వికెట్లు తీసుకున్నాడు.

అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ శాఖ అడహాక్ కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్షులుగా ప్రొఫెసర్ సత్తార్ సాహిర్
- ప్రధాన కార్యదర్శిగా హిదాయతుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ శాఖ అడహాక్ కమిటీ ఏర్పాటైంది. మంగళవారం క్రిసెంట్ హై స్కూల్‌లో అడహాక్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా రిటైర్డ్ ప్రొఫెసర్ సత్తార్ సాహిర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ హిదాయతుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయుల, పాఠశాలల, పాఠ్య పుస్తకాల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో దాదాపు 12 జిల్లాల అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ జిల్లా శాఖల ప్రతినిధులు అచార్యులు, సాహితీవేత్తలు, కవులు రచయితలు, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొని నూతన రాష్ట్ర అంజుమన్ అడహాక్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అమీర్ బాబు, నజీర్ అహ్మద్, జీలాని బాష, సలావుద్దీన్, పలువురు ఉర్దూ కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, జిల్లా అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు'

ప్రజాశక్తి - కడప అర్బన్

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్రం, జెబివిఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో కడప స్థానిక ఉక్కాయిపల్లి నిర్మల ఫార్మసీ కళాశాలలో మాదకద్రవ్యాలు యువతని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయి అనే అంశం పైన వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువగా మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, దానివల్ల సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని తెలిపారు. రిమ్స్ సైకియాట్రిస్ట్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే మత్తు మాదకద్రవ్యాల వాడకం రోజురోజుకు పెరుగుతుందని చెప్పారు కార్యక్రమంలో కళాశాల కో- ఆర్డినేటర్ శ్రీధర్ శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హెచ్‌ఒడి నరేష్, సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, మదర్ థెరిసా ఫౌండేషన్ చైర్మన్ జూటూరు విజయ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైవీయూ పిఆర్ సెల్ సంచాలకులుగా డాక్టర్ సరిత

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్స్ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ పి.సరితను నియమించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయంలోని విసి ఛాంబర్‌లో ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ డాక్టర్ సరితకు నియామకపు పత్రాన్ని అందజేశారు. వైవీయూ పరీక్షల విభాగ చీఫ్ సూపరింటెండెంట్ గా ఆచార్య కాత్యాయిని నియమితులయ్యారు.

1 నుంచి ఇంటింటా నైపుణ్య గణన

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇంటింటా నైపుణ్య గణనా కార్యక్రమం నవంబర్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో నైపుణ్య గణనా 2024 పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా విద్యార్థులు, నైపుణ్య వివరాలు సేకరిస్తారని తెలిపారు. తక్కువ ఆదాయం పొందుతున్న వారి ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆధార్ కార్డుతో వివరాలను అనుసంధానం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయ్ కుమార్, పలువురు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

సంస్థ నిర్వాహకులతో ఇన్‌ఛార్జి కలెక్టర్

గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ అదితి సింగ్ అన్నారు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కడప వారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి ఆర్సెటి అడ్వయిజరీ కమిటీని సమా వేశాన్ని నిర్వహించారు. ఈ ఆరు నెలల్లో ఎన్ని శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని ఆమె బ్యాంక్ ఆర్ఎం మురళీమోహన్‌నుఅడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతను ఎలా సమీకరిస్తున్నారని, శిక్షణకు అవసరమైన అర్హతలు ఏంటి అనే వివరాలపై ఆరా తీశారు. సంస్థ నిర్వహించే కార్యక్రమాలను అభినందించారు. నవంబర్ 20 నుంచి మహిళల దుస్తులు, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌డిసిఎం జనార్ధన్, పీడీ డిఆర్‌డి ఏడీ ఆనంద్ నాయక్, నాబార్డ్ డిడిఎం విజయ్ విహారి, డిఐసిజిఎం చాందుబాష, ఆర్‌సెటి డైరెక్టర్ ఆరీఫ్ పాల్గొన్నారు.

2న చిత్రలేఖనం పోటీల సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా బాలోత్సవ సమావేశం యుటిఎఫ్ భవనంలో నిర్వహించారు. నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన చిత్రలేఖనం పోటీలను జయప్రదం చేయడానికి నవంబర్ 2న ఉదయం 10 గంటలకు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సన్నాహ సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు గుర్రం గోపాల్, నాయకులు బి.లక్ష్మీరాజా, నాగ ముని రెడ్డి, జి. ఏలేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయటానికి ఉమ్మడి జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాజంపేట, రాయచోటి నిర్వహించ తలపెట్టినట్లు చెప్పారు.

సోరియాసిస్‌పై అవగాహన అవసరం

- జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపల్

సోరియాసిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండడం అవసరమని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం డెర్మటాలజీ విభాగపు హెచ్‌ఒడి పెంచలయ్య అధ్యక్షతన ప్రపంచ సోరియాసిస్ దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ రమాదేవి మాట్లాడుతూ సోరియాసిస్ చికిత్స అందుబాటులోకి రావడం శుభ సూచకమన్నారు. రాయలసీమ ప్రాంతంలోని సోరియాసిస్ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిజిహెచ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ సోరియాసిస్‌తోపాటు బొల్లి, దురద వంటి సమస్యలకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.సురేశ్వరరెడ్డి మాట్లాడుతూ సోరియాసిస్ దీర్ఘకాలిక వ్యాధి కావడంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలన్నారు. చర్మవ్యాధుల విషయంలో సహనం వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు నరోత్తమరెడ్డి, చర్మవ్యాధుల విభాగం వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలకు దూరంగా ఉండండి : డిఎస్‌పి

ప్రజాశక్తి - సిద్ధవటం : ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు తెలియజేశారు. మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం బాణాసంచా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలో బాణాసంచా దుకాణాలు19 ఉన్నాయని, అగ్ని ప్రమాదాలు జరగకుండా, ఇసుక, వాటర్, డ్రమ్ములు, గ్యాస్ సిలిండర్లు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి దుకాణదారుడు లైసెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలో ఉచిత ఇసుక రవాణాపై ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణదారులకు ఉచిత ఇసుక విధానం అమలు చేసిందని, ఇసుక విధానంపై దళారి వ్యవస్థ వస్తే సహించే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

ప్రజాశక్తి - కమలాపురం టౌన్ : మండల పరిధిలో బెల్టు షాపులు నడుపుతున్న వారిపై ఎస్‌పి ఆదేశాల మేరకు కఠిన చర్యల చేపడుతామని కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం బెల్టు షాపులు నడుపుతున్న వారిని, మద్యం దుకాణదారులను స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మద్యం దుకాణం, బార్ రెస్టారెంట్ వారు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. జిల్లాలో ఎక్కడైనా బెల్ట్ షాపులు నడిపినా, అసాంఘిక కార్యక్రమాలు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

న్యాయ సేవలను తెలుసుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరు మండలం గంజికుంట పంచాయతీలోని సుగాలి తండాలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలు న్యాయ సేవలను తెలుసుకొని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందన్నారు. చట్టాలను తెలుసుకోవడం ద్వారా మోసపోకుండా ఉండవచ్చన్నారు. పేద ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైబల్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ సరస్వతి, తహశీల్దార్ నరేంద్ర రాజసింహ, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, సర్పంచ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దివాలి విత్ మై భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రస్తుతం దీపావళి పండుగ రోజున కాలుష్యాన్ని కలుగజేసే టపాసులను కాల్చరాదన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా బాధ్యులు మణికంఠ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాల సూచీలో భారతదేశం పర్యావరణ పరిరక్షణలో వెనుకబడి ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించి పర్యావరణ సూచీని పెంచవలసిన బాధ్యత యువతపై ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లపై ఎక్కువగా ఉందని వివరించారు. కూరగాయల మార్కెట్ పరిసరాలను, అంకాలమ్మ గుడి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్‌బిఎస్ఎం కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ రవికల్యాణ్, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి శివశంకర్, ఎన్ఎస్ఎస్ వాలంటర్లు పాల్గొన్నారు.

నీటి కుంటలో ఆయిల్ బాల్స్ వదులుతున్న ఆశా కార్యకర్తలు

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని లయోలా కాలేజీ వద్ద, రోటరీపురం బ్రిడ్జి దగ్గర నీరు నిలిచిన ప్రదేశంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. అందులో ఆయిల్ బాల్స్ వదిలినట్లు వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. మంగళవారం ఆయిల్ బాల్స్‌ను మురుగునీటి కుంటల్లో, వర్షపు నీరు చేరే ప్రదేశాల్లో వైద్య సిబ్బందితో వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు నిలిచిన ప్రదేశాల్లో, పెద్దపెద్ద మురికి కాలువలో దోమల నివారణ చర్యల్లో భాగంగా దోమల లార్వా (గుడ్లు)ని నివారించేందుకు ఆయిల్ బాల్స్ వేశామన్నారు. ఇలా చేయడం వల్ల ఆయిల్ బాల్స్ నుండి ఆయిల్ అనేది విడుదలై దాని చమురు నీటిపై ఒక చిన్న పొరలా ఏర్పడుతుందన్నారు. ఇది దోమల లార్వా పుట్టుక దశలోనే తొలగిస్తుందని తెలిపారు. ఆయా ప్రదేశాల్లో పదుల సంఖ్యలో ఆయిల్ బాల్స్‌ను వదిలినట్లు వివరించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారం మురికి కాలువల్లో ఎక్కడపడితే అక్కడ వేయకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుభాహన్ బి, బుజ్జి, మేరీ మంజుల, సుజాత, ఆశా కార్యకర్తలు హుస్సేన్ బి, మేరీ పద్మజ పాల్గొన్నారు.

వ్యర్థాలను చెత్త వాహనాల్లోనే వేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇంటిలోని వ్యర్థాలను చెత్త వాహనాల్లోనే వేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు, వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ముద్దనూరు రోడ్డులో జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ శుభ్రం పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటిలోని వ్యర్థాలను డ్రయినేజీలో వేయవద్దన్నారు. అలా చేయడం వల్ల మురుగునీరు పోయేందుకు వీలుండదని తెలిపారు. మురుగునీరు రోడ్లపై పొర్లకుండా శానిటేషన్ సిబ్బంది చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్, వైఎస్ మనోహర్‌రెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

మండలంలోని పందిళ్లపల్లె-భారతి సిమెంట్ పరిశ్రమ మధ్య సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముద్దల సుబ్బరాయుడు (20), ప్రొద్దుటూరుకు చెందిన రాజశేఖర్ (50) మృతి చెందారు. నల్లింగాయపల్లెలో జరిగిన ఓ విందు కార్యక్రమానికి హాజరైన రాజశేఖర్ తిరిగి వెళుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందగా, ఢీ కొట్టిన సుబ్బరాయుడు తలకు కూడా బలమైన గాయమై మృతి చెండాడు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాల గ్రామ ప్రధాన రహదారి వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. ఈ విషయం గ్రామస్తులకు ఆలస్యంగా తెలిసింది. గ్రామ పెద్దలు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని విచారణ చేపట్టారు. హుండీలో పెద్ద ఎత్తున నగదు ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. పోలీసులు తక్షణం నిందితులను గుర్తించి, శిక్షించి, చోరీకి గురైన సొమ్మును రాబట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రైతుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లె తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన మొక్కలను నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మొక్కలు నాటి నీరు పోశారు. వైఎస్ఆర్ సభా భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో బిటెక్ రవి పొద్దుతిరుగుడు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని చెప్పారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీపావళి తర్వాత పనులు మొదలు పెడతామని కాంట్రాక్టర్ కూడా తమకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. హనుమాన్ జంక్షన్ నుండి రోడ్డు పనులు ప్రారంభమవుతాయని రవి తెలిపారు. వేంపల్లెను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వేంపల్లెలో అన్న క్యాంటీన్ తప్పక ఏర్పాటు చేస్తామన్నారు. ట్రిపుల్‌ఐటిలో పని చేస్తున్న సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో టిడిపి కోసం పని చేయని వారు ఇటీవల అధికారుల వద్ద కూర్చుని పెత్తనం సాగిస్తున్నారని, దాని వల్ల నిజమైన కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. రెండు నెలల్లో పులివెందుల నుండే క్రమశిక్షణ అనేది ప్రారంభిస్తానని సిఎం హామీ ఇచ్చారని రవి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఎపిఒ పార్వతి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, సీనియర్ నాయకులు బాలస్వామి రెడ్డి, జగన్నాథరెడ్డి, యువనేత రజనీకాంత్ రెడ్డి, శివ కృష్ణా రెడ్డి, భాస్కర్, వీరబద్ర, వేమా కుమార్, డక్కా రమేష్, జబిబుల్లా, మహమ్మద్ ఇనాయతుల్లా, ఈశ్వరయ్య, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్, డాక్టర్ కరీముల్లా, సయ్యద్ పీరా సాహెబ్, మహబూబ్ షరీఫ్, ఇలియాస్ పాల్గొన్నారు.

వరి రైతులు తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి మ్యాగీ

ప్రజాశక్తి - చాపాడు

వరి పంటలో దోమ, ఆకుముడుత తెగుళ్లు అధికంగా సోకుతున్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ మ్యాగీ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అన్నవరం, మడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో మండల పరిధిలో 12వేల ఎకరాల్లో వరి సాగులో ఉందన్నారు. దోమ సోకిన పంటకు సకాలంలో అసిఫెట్ మందు పిచికారి చేయాలన్నారు. అవసర మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలన్నారు. యూరియాను రైతులు అధికంగా ఉప యోగిస్తున్నారని, తక్కువగా వాడాలని తెలిపారు. రైతు సేవ కేంద్రాల్లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు శ్రీలత, లక్ష్మణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

లింగాల : వరి పంట సాగులో అధిక దిగుబడిలు సాధించాలంటే రైతులు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఎఒ రమేష్ తెలిపారు. మండల పరిధిలోని పార్నపల్లెలో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి రైతులతో సమావేశమయ్యారు. రైతులు ఆధునిక పద్ధతులు అనుసరించి లాభాసాటి వ్యవసాయం చేయాలన్నారు. రసాయనిక ఎరువులు. పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. వరి పంటలో జింక్ లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సుడి దోమ నివారణకు రెండు మీటర్లు కాలిబాటలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో 300 ఎకరాల్లో వరి పంట సాగులో ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జి ప్రసన్నకుమారి, పశువైద్య సహాయకులు నరేంద్ర, రైతులు పాల్గొన్నారు

వరి పంటపై రైతులకు సూచనలిస్తున్న ఎఒ రమేష్

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

మాట్లాడుతున్న కె.సత్యనారాయణ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అమృత్‌నగర్ నుంచి మడూర్ రోడ్డు మిగులు పనులను వెం టనే పూర్తి చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అమృత్‌నగర్ నుంచి మడూరు రోడ్డులో కలిసే రహదారిలో మొత్తం సిసి రోడ్డు వేసి మధ్యలో దాదాపుగా వంద మీటర్లు వేయకుండా ఆపారన్నారు. ఈ కారణంగా ఆ దారిలో పోయే ఆటోలు, మోటర్ బైకులు వర్షం వస్తే చాలా ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు జరుగు తున్నా యన్నారు. రోడ్డు పూర్తి చేసేందుకు ఏవైనా అడ్డంకులు ఉంటే అధికారులు పరిష్కరించాలన్నారు. రాజీవ్ స్వగృహ నుంచి రోడ్డు వేయాలన్నారు. లేని పక్షంలో సంబంధిత కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామన్నారు. సిపిఎం సుందరయ్య నగర్ ఏరియా కార్యదర్శి పి.శేఖర్, మడూర్ రోడ్ ఆటో శాఖ కార్యదర్శి ఆటో యూనియన్ నాయకులు శివ, గౌస్ పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థినులకు ఉచిత సివిల్స్ శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతిభ ఉండి, ఆర్థికస్థోమతలేని ప్రొద్దుటూరు గ్రామీణ, పట్టణ విద్యార్థినులకు ఉచిత సివిల్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో లక్ష్మయ్య అకాడమీ చైర్మన్ 25 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల వ్యయంతో ఉచిత సివిల్ శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన క్రమంలో ప్రొద్దుటూరులో కూడా సివిల్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పామన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి ఇంకా కొంతమంది సహకారంతో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. నవంబర్ 3న కామిశెట్టి సుబ్బారావు డిగ్రీ కళా శాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అందులో 25 మంది విద్యార్థినులను ఎంపిక చేస్తారన్నారు. ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కలిగి అవకాశం కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ కోచింగ్ సెంటర్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. నంద్యాల కొండారెడ్డికి ఈ ఆలోచన రావడం ఈ ప్రాంత విద్యార్థినుల అదృష్టమన్నారు. వివరాల కోసం 98856 09999ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

ఎస్ఆర్ఐటిలో గెస్ట్‌టాక్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రూరల్ పరిధిలోని ఎస్ఆర్ఐటి కళాశాలలో మంగళవారం థింకింగ్, కొలాబ్రేషన్‌పై గెస్ట్‌టాక్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. బెల్ రిటైర్డ్ డిజిఎం రిసార్స్ పర్సన్ ఉమామహేశ్వర్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిలింగ్ ఆధ్వర్యంలో థింకింగ్, కొలాబ్రేషన్, రిఫ్లేటింగ్ ఆటో వర్క్స్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో చాలా ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, బిటెక్ మూడవ సంవత్సరం విద్యార్థులు, హెచ్ఒడిలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - దువ్వూరు

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. దువ్వూరు పోస్టాఫీస్‌ను మంగళవారం ఆయన తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసులో పొదుపు ఖాతాలు, ఇన్సూరెన్స్, పోస్టల్ బ్యాంకు సేవలు సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రికార్డులు పరిశీలించారు. ఖాతాదారులకు పోస్టాఫీస్ పలు సేవలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరెడ్డి

అవగాహన కల్పిస్తున్న నవభారత్ ఫెర్టిలైజర్ ప్రతినిధులు

రసాయనిక ఎరువులతో భూసారం తగ్గుతుంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పంటసాగులో రసాయన ఎరువులు అధికంగా వాడితే క్రమంగా భూమిలో సారం తగ్గి, పంట దిగుబడులు తగ్గిపోతాయని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫిల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సీనియర్ ఎఎండిఇ శ్రీహరి తెలిపారు. మంగళవారం గొల్లపల్లి గ్రామంలో నవ భారత్ ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మానవ, జంతువాళికి ముప్పు కలిగిస్తాయన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతాయన్నారు. రైతులు సేంద్రియ, జీవ సంబంధ ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించవచ్చన్నారు. అధిక దిగుబడులను పొందవచ్చన్నారు. నవ భారత్ ఫర్టిలైజర్స్ రైతులకు అందించే సేంద్రియ ఎరువులు అధిక పూత, దిగుబడులను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెని ప్రతినిధులు వై.సురేష్‌బాబు డిఎస్ఎం, గ్రామ రైతులు పాల్గొనారు.

పవర్ స్ప్రేయర్ పంపులు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే దిశగా దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ (డిసిబిఎల్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) విభాగం దాల్మియా భారత్ ఫౌండేషన్ (డిబిఎఫ్) ఉందని కడప యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా తెలిపారు. మంగళవారం 400 పవర్ స్ప్రేయర్ పంపులను తమ ప్లాంట్‌కు సమీపంలోని గ్రామ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పంట రక్షణ కోసం తాము చేపట్టిన కార్యక్రమాలలో రెండవ దశలో భాగంగా పంపిణీ చేశామన్నారు. వ్యాధులు, తెగుళ్ల వల్ల కలిగే పంట నష్టాన్ని నియంత్రించడం, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం, రైతులకు ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా చేసుకున్నామన్నారు. డిబిఎఫ్ ఈ కార్యక్రమానికి రూ.8,89,500 అందజేయగా లబ్ధిదారులు రూ.13,55,500 అందజేశారన్నారు. కార్యక్రమంలో దాల్మియా భారత్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పవర్ స్ప్రేయర్లతో రైతులు, దాల్మియా భారత్ ఫౌండేషన్

రక్తదానం చేస్తున్న మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుకండి

- డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

పోలీసు అమరుల వారోత్సవాల్లో భాగంగా మైదుకూరులో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరుడిఎస్‌పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం వంటిదని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో రక్తాన్ని ఇవ్వడం ఒక ప్రాణాన్ని కాపాడిన వారమ వుతామన్నారు. సకాలంలో రక్తమందక చాలా మంది ప్రాణాలు కోల్పోతు న్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీ సులు, ప్రజలు రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ రక్తాన్ని దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రజలు, డాక్టర్లు, సిబ్బందికి డిఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు.

వేంపల్లె : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఎస్‌పి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. దాదాపు 100 విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రొద్దుటూరు సర్వజన ఆస్పత్రి డాక్టర్ దిలీప్ వారి సిబ్బంది రక్తాన్ని సేకరించారని డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎవిఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జె.దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు సుబ్బరాయుడు, గోవర్ధన్, అనిల్, అపర్ణ, ఇందుమతి, విశ్వనాథరెడ్డి, తిరుపతిరెడ్డి, ఆర్కేవ్యాలీ సిఐ నాగరాజు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాంసం బహిరంగ ప్రదేశాల్లో అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మాంసం బహిరంగ ప్రదేశాల్లో అమ్మితే చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్ హెచ్చరించారు. స్థానిక జంతు వధ శాలను మంగళవారం సిఐ, ఎస్ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్తీ లేకుండా నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలన్నారు. పొట్టేలు, మేకను బహిరంగ ప్రదేశాల్లో వధిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల మనోభా వాలకు భంగం వాటిల్లేలా మాంసం అమ్మకాలు జరపకూడదన్నారు. జంతు వధశాలలో శుభ్రత పాటించాలన్నారు. శుభ్రమైన నీరు విని యోగించాలన్నారు. జంతువధ శాలలో కుళాయిలు ఏర్పాటు చేసేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మాంసం అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

జంతువధశాలను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ

బాంబు స్క్వాడ్ వాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

ప్రజాశక్తి - వేంపల్లె

మండల పరిధిలోని నందిపల్లె వద్ద బాంబు స్క్వాడ్ వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో బాంబు స్క్వాడ్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పులివెందులకు వస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా బాంబు స్క్వాడ్ సిబ్బంది నందిపల్లె గ్రామ సమీపంలో వాహనాన్ని పక్కన పెట్టి రోడ్డును పరిశీలిస్తుండగా పాపాఘ్ని నది నుండి ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా ఆ వాహనాన్ని ఢీకొనడంతో పొలాల్లోకి దూసుకెళ్లింది.

చెరుకూరు శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎంఇఒ స్టాలిన్

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శికి ఘన సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనా చెరుకూరు శ్రీనివాసులును ఎంఇఒ స్టాలిన్ ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్లస్-టు పని చేస్తున్న చెరుకూరు శ్రీనివాసులు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో పాఠశాల తరుపున ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఇఒ స్టాలిన్ మాట్లాడుతూ చెరుకూరి శ్రీనువాసులు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ యూనియన్‌లో కూడా కీలక బాధ్యతలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కెవి పులివెందుల సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి లేఔట్ ఫీడర్ కింద ట్రాన్స్‌ఫార్మర్ ఎరక్షన్ ఉన్న సందర్భంగా బుధవారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణ కాలేజి రోడ్డు, ఎస్‌బిఐ కాలనీ, మున్సిపల్ ఆఫీసు రోడ్డు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిధులు దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని బద్రిపల్లి గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగంపై మంగళవారం కడప, జమ్మలమడుగు డిఎల్పీఓలు విజయభాస్కం, తిమ్మక్క విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయంలో ప్రయివేట్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న హనీఫ్‌బాషా బద్రిపల్లి గ్రామపంచాయతీ నిధులను తన చేతివాటంతో రూ.2.50 లక్షలు తన అనుకూలమైన వారి ఖాతాకు బదిలీ చేసుకున్నాడన్నారు. గ్రామ సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. 20 రోజుల్లో స్వాహా చేసిన సొమ్మును చెల్లిస్తామని ఒప్పంద పత్రం రాయించామన్నారు. కంప్యూటర్ ఆపరేటర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. పూర్తి నివేదికను డిపిఒకు అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సర్పంచ్ భర్త నారాయణ యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌ను విచారిస్తున్న డిఎల్పీఓలు